క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెళ్లకూరు: పెళ్లకూరులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. ఉదయం 7గంటలకు సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గడప గడపకు కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

కండలేరులో 50.774 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 50.774 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 1,410 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 100, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిజ్‌కు 30, హైలెవల్ స్లూయిజ్‌కు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

శ్మశాన స్థలం పరిశీలన



శిరసనంబేడులో శ్మశాన భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడు గ్రామం సర్వే నంబర్ 169–7లోని 2.74 ఎకరాల శ్మశాన స్థలాన్ని ఆదివారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాసులు, తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. గ్రామంలోని గిరిజనులు శ్మశాన భూమి ఆక్రమణలకు గురైనట్లు ఇటీవల జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు గ్రామంలో పర్యటించి శ్మశాన భూమిని పరిశీలించి హద్దులు ఏర్పాటు చేశారు. త్వరలో ఆక్రమణలు తొలగించి చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

నేడు నేతాజీ జయంతి వేడుకలు

వెంకటగిరి: నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌వీఎం ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం సాయంత్రం 4 గంటలకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 126వ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలియజేశారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన జవాన్ లాన్స్‌నాయక్, బి సాయితేజ తల్లిదండ్రులను సన్మానిస్తామని తెలిపారు. అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



నాయుడుపేటటౌన్: పట్టణంలోని లోతువాని గుంట కాలనీ వద్ద స్థానిక వైఎస్సార్ సీపీ నేత తంబిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఆదివారం పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది తన వంతుగా సహాయ కార్యక్రమాలు చేపట్టే మధుసూదన్ రెడ్డి స్థానిక పురపాలక సంఘంలో పనిచేస్తున్న 100 మందికి పైగా కార్మికులకు దుస్తులను అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. సుబ్బారావు, సుధ, శీను, బాలకృష్ణయ్య, సరసమ్మ, వనమ్మ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ప్రిలిమ్స్ ప్రశాంతం



ఆదిశంకర కళాశాల పరీక్ష కేంద్రం వద్ద అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ



పరీక్ష కేంద్రం వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

- అడిషనల్ ఎస్పీ రాజేందర్

గూడూరు : ప్రశాంత వాతావరణంలో పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలు జరిగాయని అడిషనల్ ఎస్పీ రాజేందర్ తెలిపారు. గూడూరు పట్టణ, రూరల్ పరిధిలోని 7 కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. పట్టణ సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని ఆయన, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డితో కలిసి పరిశీలించారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ డివిజన్‌లో 4,542 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 4,267 మంది హాజరయ్యారన్నారు. 275 మంది గైర్హాజరయ్యారన్నారు. అన్ని కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులకు సమాచారం అందజేసేందుకు పోలీస్ హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేశామని చెప్పారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి కేంద్రం వద్ద 108ను ఉంచామన్నారు.



పరీక్షకు అనుమతించాలని అభ్యర్థిస్తున్న శివ

ఒక్క నిమిషం ఆలస్యమైనందుకే..

రాపూరు మండలం కృష్ణారెడ్డిపల్లికి చెందిన కె. శివ గూడూరులోని నారాయణ కళాశాలకు వచ్చేలోగా ఒకే ఒక్క నిమిషం ఆలశ్యమైందని, దీంతో పరీక్షకు అనుమతివ్వలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు



కోళ్లమిట్టలో లబ్ధిదారుకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట రూరల్: పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందజేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. పట్టణంలోని కోళ్లమిట్ట సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వార్డు సభ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పేదల కోసమే సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని తెలిపారు. అర్హులందరికీ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు అదేవిధంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం పేదలకు చేసిందేమి లేదని ఆరోపించారు. మళ్లీ జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ, కౌన్సిలర్లు ముని, రాజా, విజయలక్ష్మి, నేతలు జెట్టి వేణు, తిరుపాల్ పాల్గొన్నారు.

శతాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లసిరి గోపాల్‌రెడ్డి

- ఫిబ్రవరి 12న నిర్వహించేందుకు నిర్ణయం
- రూ.4 లక్షలతో ల్యాబ్ పరికరాలు, ఫర్నిచర్, కెమికల్స్

గూడూరు : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులందరూ ఏకం కావాలని పూర్వవిద్యార్థి, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక హైస్కూల్ రోడ్డులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థులు సమావేశమయ్యారు. ఫిబ్రవరి 12 ఆదివారం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్ణయించారు. వారు మాట్లాడుతూ పాఠశాలలో చదివి, దేశ, విదేశాల్లో స్థిరపడిన వారెందరో ఉన్నారన్నారు. ఈ మేరకు వారందరూ ఈ కార్యక్రమానికి హాజరవ్వాలన్నారు. పూర్వవిద్యార్థులు రూ.4 లక్షలతో ల్యాబ్ ఆధునీకరణ, పరికరాలు, కెమికల్స్, ఫర్నిచర్ ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం ఎంతో అభినందనీయమని హెచ్‌ఎం రవూఫ్ అన్నారు. ఫిబ్రవరి 12వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించనున్న ఈ శతాబ్ది ఉత్సవాలకు పూర్వ విద్యార్థులంతా కుటుంబాలతో హాజరై, గత స్మృతులను నెమరు వేసుకోవాలని ప్రముఖ ఆడిటర్, పూర్వ విద్యార్థి శ్రీకంటి రామ్మోహన్‌రావు పిలుపునిచ్చారు. దేవానంద్, రామ్మోహన్‌రావు, పీవీ కృష్ణయ్య, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల ఢీ

- ముగ్గురికి తీవ్రగాయాలు

దొరవారిసత్రం: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన టపాయిండ్లు గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. నాయుడుపేట మండలం శ్రీనివాసపురం ఎస్టీ కాలనీ చెందిన దంపతులు పోలయ్య, వసంతమ్మ ద్విచక్రవాహనంలో సూళ్లూరుపేటకు బయలుదేరారు. అదేసమయంలో దిగువమేలుపాక గ్రామానికి చెందిన సంతోష ద్విచక్రవాహనం ఎదురుగా రావడంతో రెండు రెండు ఢీకొన్నాయి. ఈప్రమాదంలో రెండు ద్విచక్రవాహనాల్లో వెళుతున్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ ముగ్గురిని స్వర్ణటోల్‌వే అంబులెన్స్‌లో నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఓపెన్ మారథాన్‌లో పేట క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన ఎస్ఎస్ఎఫ్ క్రీడాకారులు



నాయుడుపేటటౌన్ : తమిళనాడులోని చెన్నై బీచ్ రోడ్డు వద్ద ఆదివారం జరిగిన ఓపెన్ మారథన్ అథ్లెటిక్ పోటీల్లో నాయుడుపేట నాయుడుపేట స్పోర్ట్స్ ఫెడరేషన్ క్రీడాకారులు ప్రతిభ చూపి పలు విభాగాల్లో పతకాలు సాధించినట్లు ఎస్ఎస్ఎఫ్ వ్యవస్థాపకులు మోమిడి లక్ష్మయ్య తెలిపారు. ఎస్ మోక్ష 5 కిలోమీటర్ల పరుగుపందెంలో ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. అండర్–10 విభాగంలో ఎం.మహీధర్ 3 కిలోమీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. ఎం.మయూరి రెండవ స్థానంలో నిలిచి వెండి పతకం దక్కించుకున్నట్లు చెప్పారు. విజేతలకు నిర్వాహకులు ప్రథమ స్థానంలో నిలిచిన ఇద్దరికి రూ.3 వేలు, రెండవ స్థానంలో నిలిచిన బాలుడికి రూ.2 వేల నగదుతో పాటు స్పోర్ట్స్ బ్యాగులను అందించినట్లు లక్ష్మయ్య తెలిపారు. విజేతలను స్థానిక ఎస్ఎస్ఎఫ్ అధ్యక్షుడు కలికి సుధీప్‌రెడ్డి అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



మాట్లాడుతున్న సీఐ సోమయ్య

ఓజిలి: జాతీయరహదారిపై వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నాయుడుపేట రూరల్ సీఐ వై సోమయ్య అన్నారు. రాజుపాళెం గ్రామంలో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆటోడ్రైవర్లకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రహదారి భద్రతా వారోత్సవాలపై పలు సూచనలు, సలహాలను అందించారు. సూళ్లూరుపేట ఏంవీఐ బి.అనీల్‌కుమార్, సిబ్బంది మధుసూదన్‌రావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



చిట్టేడు పీహెచ్‌సీలో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రామిరెడ్డి

కోట: పీహెచ్‌సీల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రామిరెడ్డి అన్నారు. చిట్టేడు పీహెచ్‌సీని ఆదివారం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రామిరెడ్డి తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. డాక్టర్లు, సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. చిట్టేడు పీహెచ్‌సీకి కొత్త భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తెచ్చామని, మెరుగైన వైద్యసదుపాయాలు కల్పించామన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ హనుమంతరావు, డాక్టర్ నాగరాజు ఉన్నారు.

దుకాణంలో అగ్నిప్రమాదం



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాపూరు: రాపూరు పాత బస్టాండులోని హోల్‌సేల్ దుకాణంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం దుకాణంలో నుంచి, మంటలు రావడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సకాలంలో మంటలు ఆర్పడంతో ఆస్తి నష్టం తగ్గిందని వ్యాప్తి అగ్నిమాపక ఇన్‌చార్జి అధికారి శ్రీనివాసులు తెలిపారు. రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు దుకాణ యజమాని వెంకటమ్మ తెలిపారు.

గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం



ఎన్ఎస్ఆర్ కాలనీలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రభాకర్‌రావు

నాయుడుపేటటౌన్ : గంజాయి విక్రయాలు, సింగల్ నంబర్లు, జూదం, అక్రమ రవాణాలపై ఉక్కుపాదం మోపుతామని నాయుడుపేట సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం పలు కాలనీల్లో తనిఖీలు చేపడుతూ స్థానికులను సమావేశ పరిచి సీఐ అవగాహన కల్పిస్తున్నారు. సీఐ మాట్లాడుతూ పట్టణంలో రహస్యంగా గంజాయి, గుట్కా అక్రమంగా విక్రయాలు జరుపుతున్న వారిని అరెస్టు చేసి నియంత్రించామన్నారు. అయినప్పటికీ కొందరిలో ఇంకా మార్పురాలేదని అటువంటి వారిని ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించేది లేదని వారిపై పీడీ యాక్టు నమోదు చేసి కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఏదైన అసాంఘిక కార్యక్రమాలు జరగుతుంటే 100కుగానీ, నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి సెల్ నంబర్ 94910 86024, తన సెల్ నంబర్ 94407 96357కు సమాచారం అందించాలని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

బీసీలు జగనన్నకు రుణపడి ఉంటారు



మొదలియార్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చెంచయ్య

నాయుడుపేటటౌన్ : బీసీల సంక్షేమానికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వారు ఎప్పటికీ రుణపడి ఉంటారని స్థానిక మొదలియార్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కరీంబాయి చెంచయ్య మొదలియార్ పేర్కొన్నారు. నాయుడుపేటలోని నివాసం వద్ద ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీల సంక్షేమ కోసం ఏర్పాటు చేసిన 56 కార్పొరేషన్‌ల పాలక వర్గాల పదవీకాలం పొడిగించడం ఎంతో హర్షణీయమన్నారు. సీఎంతో పాటు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చొరవతో మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తిరిగి కొనసాగిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం ఆనందంగా ఉందన్నారు. తండ్రికి తగ్గ తనయుడుగా పేరు తెచ్చుకుంటున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో పాటు సూళ్లూరుపేట నియోజవర్గ అభివృద్ధికి ఎనలేని కృషిచేస్తున్న ఎమ్మెల్యే కిలివేటికి చెంచయ్య కృతజ్ఞతలు తెలిపారు.

ప్రగతిపథంలో మానమాల

- గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు
- మూడున్నరేళ్లలో మారిన గ్రామ రూపురేఖలు
- సమృద్ధిగా తాగునీటి వనరులు
- సకాలంలో డ్రైనేజీ, పాఠశాల మరమ్మతులు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

ఓజిలి: మండల కేంద్రానికి కూతవేటు దూరంలోని మానమాల గ్రామ పంచాయతీ ప్రగతిపథంలో దూసుకుపోతోంది. గతానికి భిన్నంగా.. కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధి పథంలో పయనిస్తోంది. స్థానికులకు అవసరమైన మౌలిక వసతులు సకాలంలో చేరుతుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మూడున్నరేళ్లలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సహకారంతో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. తాగునీరు, డ్రైనేజీ, వీధిలైట్లు, సీసీ రోడ్లు వంటి అభివృద్ధి కార్యక్రమాలు పూర్తయ్యాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మూడున్నరేళ్లలో అభివృద్ధి ఇలా..

- సీసీరోడ్లకు రూ.25 లక్షలు, రూ.30 లక్షలతో 400 మీటర్ల డ్రైనేజీ
- నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధికి రూ.8.92 లక్షలు
- రూ.60 లక్షలతో మురుగునీటి కాలువలు, రైతుల సౌకర్యార్థం పొర్లుకట్టలు రూ.70 లక్షలతో ఏర్పాటు
- గ్రామంలో సీసీరోడ్లు



ఎస్టీకాలనీలో నిర్మించిన సీసీరోడ్డు



జలజీవన్‌మిషన్ పథకంలో ఏర్పాటు చేసిన తాగునీటి బోరు

- చెత్త నుంచి సంపద కేంద్రం పూర్తి. మనం– మన పరిశుభ్రత కార్యక్రమంలో ట్రై సైకిల్, 500 చెత్తబుట్టలు అందుబాటులోకి
- ఎస్టీకాలనీ వాసులకు 54 పక్కాగృహాలు, దళితవాడకు 7, బీసీలకు 5 ఇళ్లు మంజూరు. (గిరిజన కాలనీలో ఇళ్ల నిర్మాణం పూర్తి)
- 500 ఎకరాల ఆయకట్టుకు తెలుగుగంగ నీరు

గ్రామ పంచాయతీ వివరాలు		
కుటుంబాలు	:	360
జనాభా	:	1120

- నూతనంగా 50 పింఛన్లు మంజూరు
- 258 మందికి ఎన్ఆర్‌ఈజీపీ పథకం ద్వారా ఉపాధి పనులు
- తాగునీటి సౌకర్యం కోసం రూ.4.5 లక్షలు మంజూరు
- ఎస్టీ కాలనీలో రూ.10 లక్షలతో జలజీవన్ మిషన్ పథకంలో తాగునీటి బోరు, పైపులైన్లు

సిమెంట్ రోడ్లు నిర్మించారు



కాలనీలో సిమెంట్ రోడ్లు నిర్మించారు. గతంలో వర్షమొస్తే మట్టి రోడ్లు బురదమయంగా మారేవి. ఆ రోడ్లపై నడవలేక ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.
– ఇమ్మిడిశెట్టి బాలకృష్ణ, బీసీ కాలనీ

ఇంటికి పింఛన్ తెచ్చి ఇస్తున్నారు



నా భర్త చనిపోయాడు. వితంతు పింఛన్ మంజూరైంది. గతంలో పింఛన్ కోసం పాఠశాల వద్ద వెళ్లి తీసుకుంటున్నాం. ప్రస్తుతం వలంటీర్ ఇంటికి తీసుకొచ్చి ఇస్తున్నారు. కాలనీ నుంచి గ్రామంలోకి వెళ్లే పని తప్పింది.
– మేకల బుజ్జమ్మ, వితంతువు

గృహాలు మంజూరు చేయించారు



ఎస్టీ కాలనీలో 50 కుటుంబాలు పూరిళ్లలో నివాసం ఉంటున్నాం. ప్రభుత్వం నుంచి పక్కా గృహాలు మంజూరు చేయించారు. ఆర్థిక స్తోమత లేకపోతే వారే దగ్గరుండి నిర్మించారు. హాయిగా ఇళ్లలో నివాసం ఉంటున్నాం. – ఇండ్ల పద్మ ఎస్టీ కాలనీ

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి



గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కృషిచేస్తున్నారు. ఈ మూడున్నర సంవత్సరాలలో రూ.3 కోట్ల నిధులతో గ్రామాభివృద్ధి చేశాం. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుతం ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి పనులన్నీ జరిగాయి. సంక్షేమ పథకాలన్నీ ప్రజలకు అందుతున్నాయి.
– ఉచ్చూరు జీవనారెడ్డి, సర్పంచ్, మానమాల

అంతర్‌పంటలతో ఆదాయం



నిమ్మసాగులో అంతర్ పంటగా కాకర సాగు

చిల్లకూరు: నిమ్మ సాగు రైతులు అంతర్ పంటలను సాగు చేసి ఆదాయం పొందుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో దీర్ఘకాలిక పంటలైన నిమ్మ, మామిడి సాగుచేస్తున్నారు. ఈ పంటలు సాగు చేసే రైతులు పంట దిగుబడి వచ్చే వరకు ఇబ్బంది పడకుండా అంతర్ పంటలను సాగు చేసి కూరగాయలు పండిస్తున్నారు. ఈ క్రమంలోనే నెలబల్లి రెట్టపల్లికి వెళ్లే మార్గంలో జాతీయరహదారికి అనుకుని ఓ రైతు నిమ్మసాగును మూడెకరాల్లో చేశారు. ఈ పంటకు ఖర్చులు పెట్టేందుకు పెట్టుబడి ఎక్కువగా కావాల్సి రావడంతో అంతర్ పంటలు సాగు చేసుకునేందుకు మరో రైతుకు లీజుకు ఇవ్వడంతో ఆయన కాకర పంటను సాగు చేసుకుని మంచి ఆదాయం పొందుతున్నాడు. ఇలా అంతర్ పంటల సాగుతో ఇద్దరు రైతులు ఆదాయం పొందడం చూసిన వారు తాము కూడా అదే బాటలో పయనించేందుకు అడుగులు వేస్తున్నారు.

స్కూటరిస్ట్‌కి గాయాలు

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్ట్‌కి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం మేరకు.. వెంకటగిరికి చెందిన శ్రీనివాసులు(25) ద్విచక్ర వాహనంపై తిరుపతికి వెళుతుండగా సీతారాంపేట సమీపంలో వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులుకు గాయాలయ్యాయి. చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.